క్లుప్తంగా

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



పాపవినాశనం(ఘంటసాల): మాజీ సర్పంచి మునిపల్లి బుజ్జి మాతృమూర్తి రాములమ్మ మరణం బాధాకరమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నారు. మండలంలోని పాపవినాశనం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బుజ్జి తల్లి రాములమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆదివారం మాజీ సర్పంచ్ బుజ్జి, సోదరుడు నాగ మల్లేశ్వరరావు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, కుంపటి చిట్టిబాబు, జనసేన నేత జుజ్జువరపు కిరణ్ కుమార్ ఉన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత మీర్ రిజ్వాన్, సీనియర్ నేత కొండేటి భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ జగ్గారపు బాబూరావు, మామిళ్లపల్లి శరత్ బాబు, మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వెండి నాగ పడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి పెడన వాస్తవ్యులు పేరిశెట్టి నిరంజనరావు, అనంతలక్ష్మి కుటుంబ సభ్యులు రెండు కిలోల 110 గ్రాములతో తయారు చేసిన వెండి నాగ పడగను ఆదివారం సమర్పించుకున్నారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం వెండి పడగను ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మక్కా యాత్రికులకు సన్మానం

గూడూరు: మక్కాయాత్ర విజయవంతం కావాలని పెనుగుదురులంక మసీదు ఇమామ్ మెహెతాబ్ ఆలమ్ ఆకాంక్షించారు. పెనుగుదురులంక గ్రామం నుంచి అబ్దుల్ వహీద్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది ముస్లింలు ఆదివారం రాత్రి మక్కాయాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక మసీదులో మక్కా యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఆరిఫ్, షాదిక్, అబ్దుల్ సలీమ్, ఇనాయ్‌తుల్లా, బాసితుల్లా, షరీఫ్, జయలాద్దిన్, షేక్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి సంబరం

ఘంటసాల: ఘంటసాల పెద్దగూడెం గ్రామ దేవత శ్రీ గంగానమ్మ తల్లి సంబరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారి ఘటం కుండను గ్రామోత్సవంగా డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఘంటసాల సెంటర్లోని శ్రీ పెన్నేరమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ కోట ముత్యాలమ్మ తల్లి దేవస్థానం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పొలిమేర మీదగా తిరిగి పెద్దగూడెంలోని శ్రీ గంగానమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని వినతి

మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు గ్రామ సభలో అధికారులను కోరారు. గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభ నిర్వహించారు. జగనన్న కాలనీలో విద్యుత్, మంచినీరు, రహదారులు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు అధికారులను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి సాయం



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మసీదు సెంటర్‌లోనివాసం ఉండే కిడ్నీ డయాలసిస్ పేషెంట్ అబ్దుల్ సుభానీకి రాంకీ ఫౌండేషన్ రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందించింది. రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ డెప్యూటీ హెడ్ చాట్రగడ్డ మహేంద్రబాబు ద్వారా ఈ మొత్తం చెక్‌ని బాధితుడికి అందించారు.ఎస్ఆర్‌వైఎస్పీ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు అశ్వినికుమార్, బీడీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీవర్స్ కాలనీ వాసుల వెతలు

- ముంపు నుంచి విముక్తి కల్పించాలని వినతి
- ప్రతి ఇంటిలోనూ జ్వరపీడితులే



వర్షం నీటిలోనే నడవాల్సి వస్తోందని వాపోతున్న కాలనీ వాసులు

పెడన: పట్టణంలోని కానూర్ వీవర్స్ కాలనీలో కొన్ని అంతర్గత రహదారులు ఇప్పటికీ నీటిలోనే నానుతున్నాయి. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మున్సిపల్ అధికారులు అప్పుడప్పుడు వచ్చి మోటార్లతో నీటిని తోడుతున్నా ఫలితం ఉండటం లేదు. వర్షం వచ్చినా, నీరు తోడకపోయినా మోకాలిలోతు నీరు చేరుతోంది.

కచ్చా డ్రెయిన్లు లేక, నీరు ఇంకిపోక నిల్వ ఉండిపోయి దోమలకు, పాములకు నిలయాలుగా మారుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు నిల్వ ఉన్న నీటిని చూసి విధులు నిర్వహించలేకపోతున్నారు. నీరు నిల్వ ఉండి మురుగు చేరడంతో ఆ నీటిలో నడవడం వల్ల రోగాలొస్తాయని భయం వెంటాడుతోంది. అయినా కాలనీ వాసులకు మురుగు నీటిలో నడక తప్పడం లేదు.

డెంగీ జ్వరాలు వచ్చాయి



ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నారు. దోమలు అధికంగా ఉన్నాయి. రోడ్లపై నీరు నిల్వ వల్ల బయటకు కూడా పోలేని పరిస్థితి. జాగ్రత్తలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. మా వీధిలో డెంగీ జ్వరాలు వచ్చి రెండు, మూడు నెలలు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారుకూడా ఉన్నారు. ఎటునుంచి ఎప్పుడు పాములు, విషపురుగులు వసాయేమో అని భయం వేస్తుంది. వెంటనే నీరు బయటకు పోయేలా చూడాలి.

– కొల్లి మహాలక్ష్మి, కానూరు వీవర్స్ కాలనీ, పెడన

విద్యుత్ షాక్‌తో ఒకరు చనిపోయారు



నీరు నిల్వ ఉండటం వల్ల యువకుడు విద్యుత్ షాక్‌తో చనిపోయాడు. ఎప్పుడు ఏం జరుగుతుందనే భయం నిత్యం వెంటాడుతుంది. వాహనాలపై వెళ్తే సైలెన్సర్‌లోకి నీరు చేరి మొరాయిస్తున్నాయి. సొంత డబ్బులతో ఒకసారి, లేదా రెండో సారి తోడించగలం. రోజూ నీటిని తోడించలేం కదా. శాశ్వతంగా నీరు నిల్వలేకుండా అధికారులు, పాలకులు పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– పుట్ల ప్రకాశరరావు, కానూరు వీవర్స్ కాలనీ, పెడన

కచ్చా డ్రెయిన్ సరిచేస్తున్నాం..



మురుగు, వర్షం నీరు పోవడానికి గతంలో కచ్చాడ్రెయిన్ రోడ్డు పక్కన ఉండేది. జాతీయ రహదారి ఏర్పడటంతో అది కాస్తా పూడుకుపోయింది. ప్రస్తుతం మోటార్లతో తోడుతుంటే రైతులు ఊరుకోవడం లేదు. వరి పొట్ట, కోత దశలో ఉన్నాయంటున్నారు. పక్క కాలనీ వాసులు అభ్యంతరం చెబుతుండటంతో జాతీయ రహదారి పక్కన పాత కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో పూర్తవగానే మోటర్ల ద్వారా తోడేస్తాం.

– ఎం.గోపాలరావు, మున్సిపల్ కమిషనర్, పెడన

ప్రారంభానికి నోచుకోని భవనాలు



ప్రారంభానికి సిద్ధంగా ఇంతేరు సచివాలయ భవనం



ఇంతేరులోని విలేజ హెల్త్ క్లినిక్ భవనం

కృత్తివెన్ను: ప్రజల చెంతకే పాలనా సౌకర్యం కల్పించాలనే సదుద్దేశంతో సచివాలయ వ్యవస్థను గ్రామస్థాయిలో అమలు పరిచేలా చర్యలు తీసుకున్నారు నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి. దీనిలో భాగంగా ఇంతేరు గ్రామ పంచాయతీలోని సత్రవపాలెం వద్ద రూ.40 లక్షలతో సచివాలయం భవనం, రూ.14.95 లక్షలతో హెల్త్ సెంటర్, రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రం భవన నిర్మాణాలకు 2021 జనవరి 7వ తేదీన అప్పటి ఎమ్మెల్యే జోగి రమేష్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వీటిలో సచివాలయ భవనం, హెల్త్ క్లినిక్ కేంద్ర భవనం నిర్మాణం పూర్తయింది. హెల్త్ క్లినిక్‌భవనానికి విద్యుత్, నీటి సౌకర్యం కల్పించి ప్రారంభించాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఈ భవనాలలో పశువులు, కుక్కలు తిరగడంతో ముళ్లకంచెలు అడ్డుగా పెట్టారు.

ఇంకా పాత భవనంలోనే..

దీంతో ఇంతేరు గ్రామంలోని పాత పంచాయతీ భవనంలోనే పాలన సాగుతోంది. ఈ భవనం ఇరుకుగా ఉండటంతో చిన్నచిన్న గదుల్లోనే సర్దుకుని సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌కు సైతం ఇక్కడ చోటు సరిపోవడం లేదు. సర్పంచ్ పంచాయతీ కార్యాలయానికి వస్తే మరో ఉద్యోగి లేచి సర్పంచ్‌కు కుర్చీ ఇవ్వాల్సిన పరిస్థితి. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని సర్పంచ్ పెదసింగు మోకమ్మ తెలిపారు. భవనాల ప్రారంభంపై పంచాయతీరాజ్ ఏఈఈ నగేష్‌ను వివరణ కోరగా హెల్త్ క్లినిక్ భవనానికి విద్యుత్, నీటి సరఫరా ఏర్పాటు చేయలేదని త్వరలో పూర్తిచేసి భవనాల ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి



పాలకాయతిప్ప బీచ్ వద్ద పర్యాటకుల సందడి

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో పాలకాయతిప్ప బీచ్‌కు తరలి వచ్చి ఆనందంగా గడిపారు. విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, ఏలూరుకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్య బీచ్ వద్దకు తరలివచ్చారు. యువత తీరంలో బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సందడి చేశారు. చిన్నారులు తీరం వెంట ఇసుక తిన్నెలపై తమ పేర్లు రాసుకుంటూ మురిసిపోయారు. తిరుగు ప్రయాణంలో హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బీచ్ వద్ద మెరైన్ పోలీసుల గస్తీ

హంసలదీవి బీచ్ వద్ద పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. ఆదివారం కరకట్ట వద్ద ఉన్న చెక్‌పోస్టులో వాహన తనిఖీలు జరిపారు. యువత తీరానికి మద్యం, మత్తు పదార్థాలు తీసుకువెళ్లకుండా ముందు జాగ్రత్తగా ఈ తనిఖీలు చేపట్టినట్లు మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బీచ్‌లో పర్యాటకులకు జాగ్రత్తలు వివరిస్తూ అప్రమత్తం చేశారు. లౌడ్‌స్పీకర్ల ద్వారా సూచనలు ఇచ్చారు. ఎస్ఐలు జిలానీ, ఉజ్వల్, రైటర్ రెహమాన్ జానీ పర్యవేక్షించారు.



తీరంలో పర్యాటకులకు సూచనలిస్తున్న పోలీసులు

మూతపడిన గ్రంథాలయాన్ని పునర్నిర్మించండి

కృత్తివెన్ను: మండల కేంద్రమైన కృత్తివెన్నులో రైతులు స్వచ్ఛందంగా 1957 వసంవత్సరంలో నిర్మించుకున్న పెంకుటింటి భవనంలో కొన్ని సంవత్సరాల పాటు గ్రంథాలయం కొనసాగినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. 1989 వసంత్సరంలో గ్రంథాలయం ధ్వంసం కావడంతో అప్పటి నుంచి ఇక్కడ గ్రంథాలయం లేకుండా పోయింది. దాదాపు మూడున్నర దశాబ్దాలకు పైబడి ఇక్కడ గ్రంథాలయం మూతపడే ఉంది. మండలంలో కృత్తివెన్ను, లక్ష్మీపురం, చినగొల్లపాలెం దీవులు ప్రదాన సెంటర్లుగా ఉన్నాయి. దాదాపు 30 కిలోమీటర్లు పైచిలుకు పొడవు ఉన్న మండలంలో ఒక్కటి కూడా గ్రంథాలయం లేకపోవడం విద్యావేత్తలను మనోవేదనకు గురిచేస్తోంది. కృత్తివెన్నులో గ్రంథాలయం ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. ప్రభుత్వ యంత్రాంగం సొంత భవనం నిర్మించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి మండల వాసులకు శాశ్వతంగా గ్రంథాలయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు.



మూతపడి శిథిలావస్థకు చేరిన కృత్తివెన్ను గ్రంథాలయ భవనం

గ్రామ సింహాల స్వైరవిహారం



నాగాయలంక సెంటర్‌లో గుంపులుగా ఉన్న కుక్కలు

నాగాయలంక: నాగాయలంకలో ప్రజలు కొంత కాలంగా భౌభౌలతో బెంబేలెత్తిపోతున్నారు. రాత్రనక, పగలనకా గ్రామసింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక ప్రధాన కూడలిలో సైతం డజన్ల సంఖ్యలో కుక్కలు ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా హల్‌చల్ చేస్తున్నాయి. వాహనాలకు, బాటసారులకు అడ్డం పడి భయాందోళన కలిగించడంతో భీతుల్లుతున్నారు. మరోవైపు రాత్రి సమయాల్లో అన్ని వీధుల్లో కుక్కలు అధిక సంఖ్యలో గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

కుక్కలను నిర్మూలించే అధికారం తమకు లేదని గ్రామకార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు. మరో వైపు మేకలు నిత్యం విచ్చలవిడిగా గ్రామంలోని వీధులు, గృహాల వెంట తిరుగుతూ పెరటి పూల మొక్కలు, పండ్లజాతి మొక్కలను తినేస్తుండటంతో నానా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో బందెలదొడ్డి ఉన్నా మేకలను అదుపు చేయడంలో పంచాయతీ పాలకులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. అటు కుక్కలు, ఇటు మేకల విచ్చలవిడి సంచారం అధికమైందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నివారణపై కార్యాచరణ చూపాలని కోరుతున్నారు.

సమాజ శాంతికి బుద్ధిజం ఆచరించాలి



ఘంటసాల: నేటి సమాజంలో శాంతియుతంగా జీవించాలంటే బుద్ధిజంను ఆచరించాలని భంతే ధమ్మ ధజ థెరో అన్నారు. ఘంటసాలలోని అమరావతి బుద్ధ విహార్‌లో బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బౌద్ధ బిక్షువులకు కఠిన చివర దానం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ బిక్షువు భంతే ధమ్మ ధజ థెరో ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్ధ వందనం చేసి బుద్ధుని బోధనలను వివరించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబరు నెలల్లో బౌద్ధ బిక్షువులకు కఠిన చివర దానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, దీనిలో భాగంగా వస్త్రాలు, అవసరమైన వస్తువులను అందిస్తే ఉపాసకులకు మంచి జరుగుతుందనే నమ్మకంతో చివరిదానం చేస్తారని తెలిపారు. అనంతరం ఘంటసాలలోని అమరావతి బుద్ధ విహార్‌లోని భంతే ధమ్మ ధజ థెరోకు కృష్ణా యూనివర్సిటీలో పని చేస్తున్న బౌద్ధ ఉపాసకులు నాగరాజు కాషాయ వస్త్రాలు, ఇతర వస్తువులను దానం చేశారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు నగేష్, దాసి సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సమాచారం కచ్చితంగా ఉండాలి



పశుగణన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

బంటుమిల్లి: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు నిర్వహించనున్న పశుగణనపై కచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి ఇవ్వాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. 21వ జాతీయ అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన నాగేశ్వరరావుపేటలో జరిగిన కార్యక్రమంలో అధికారులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖాధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగానే ప్రభుత్వం పశుపోషణకు నిధులు సమకూర్చుతుందన్నారు. కాలానుగుణంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కె.బాబూరావు మాట్లాడుతూ పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెదతుమ్మిడి, ఆర్తమూరు, గూడూరు, నీలుపూడి, పెడన గ్రామాల్లోని పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ముస్లింల ఆందోళన



ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ముస్లింలు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తమ మనోభావాలను దెబ్బతీశారంటూ ముస్లింలు ఆందోళనకు దిగారు. సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించారు. బందరు డీఎస్పీ పోలీసు సిబ్బందిని పంపి పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అయినా ముస్లింలు, మత పెద్దలు, పలు పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు మద్దతు ఇవ్వటంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. దీంతో మరింత పోలీసు బలగాన్ని దింపి మతపెద్దలు, ముస్లింలతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆందోళనకారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ఇజ్రాయేల్ దాడిలో అశువులుబాసిన సయ్యద్ అసిన్ నస్రల్లాకు సంఘీభావంగా ముస్లింలు పలువురు ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్ ఎదుట బ్యానర్ కట్టారు. శనివారం డ్యూటీలో ఉన్న ఇనగుదురుపేట సీఐ పరమేశ్వరరావు అటుగా వెళుతున్న ఓ వ్యక్తిని పిలిచి స్టేషన్‌కు ఎదురుగా ఉన్న నస్రల్లా బ్యానర్ తీయించారు. అది చూసిన ముస్లిం యువకులు కొందరు మతపెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. ఫ్లెక్సీని చింపి ముస్లింల మనోభావాలను దెబ్బతీశారంటూ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.

సీఐపై చర్యలు తీసుకోవాలని ఫ్లెక్సీ పట్టుకుని రోడ్డుపై కూర్చుని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్ చిలకలపూడి సీఐ నబీని పంపించి ఆందోళనకారులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మళ్లీ ఆదివారం ముస్లింలు డీఎస్పీని కలిసి సంఘటనపై ఫిర్యాదు చేయగా విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి విచారణ జరిపిస్తామని చెప్పారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రామసత్యనారాయణ

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అనుబంధంగా ఉన్న శ్రీవాసవీ విద్యార్థి సహాయ నిధి ట్రస్ట్ 9వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల మీటింగ్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.5 లక్షల ఉపకారవేతనాలను చెక్కుల రూపంలో అందజేశారు. 100 మంది పేదలకు దుప్పట్లు, 20 మంది మహిళలకు చీరలు, వెయ్యి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ వీటిని అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, అవోపా రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు అరవేటి నిర్మల, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి దేవస్థానంలో క్యూలైనులో వేచిఉన్న భక్తులు

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తులతో కళకళలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా భక్తుల వాహనాలకు సరైన పార్కింగ్ లేకపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు కొంత ఇబ్బంది పడ్డారు.

నిబంధనలకు విరుద్ధంగా టపాసుల విక్రయాలు

పట్టించుకోని పోలీసులు

పెడన: పట్టణంలో టపాసుల విక్రయాలు జోరందుకున్నాయి. దీపావళికి ఏర్పాటు చేయనున్న దుకాణాదారులు తమతమ ప్రాంతాల్లో తెలిసిన వారికి, సమీపంలోని వారికి చెబుతూ విక్రయాలు జరిపేస్తున్నారు. వాస్తవంగా ఎటువంటి లైసెన్సులు లేకుండా భారీ ఎత్తున నిల్వలుంచి ఇళ్ల మధ్య విక్రయాలు జరుపుతుండటం గమనార్హం. పోలీసులు మాత్రం ఏదైనా సమాచారం ఇస్తే ఆఘమేఘాలపై వాలి, తామే తెలుసుకుని రైడ్ చేసినట్లుగా పేర్కొనే పోలీసులు టపాసుల విక్రయాలు బహిరంగంగా విక్రయిస్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. స్థానికంగా ఉండే మహిళా పోలీసుల నుంచి సమాచారం సేకరించవచ్చని తెలిసి కూడా ఆ దిశగా కృషి చేయకపోవడం విశేషం. ఇటీవల దక్షిణ తెలుగుపాలెంలో వైఎస్సార్ సీపీకి చెందిన వారు దీపావళి సరుకు దించుకుంటేనే దాడి చేసి సరుకు సీజ్ చేసిన పోలీసులు ఇళ్ల మధ్య విక్రయాలు జరుపుతున్నా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్పందించి మఠం వీధిలోను, హైస్కూలు సమీపంలో తదితర ప్రాంతాల్లో ఇళ్ల వద్ద విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారి పనులు ప్రారంభం

అవనిగడ్డ: మండల పరిధిలోని అశ్వరావుపాలెం-మోదుమూడి రహదారి పనులను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఈ రహదారి నిర్మాణానికి రూ.33 లక్షలు నిధులు మంజూరు చేయించగా సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ రహదారి పనులను పర్యవేక్షించారు. దీంతో తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.